క్లుప్తంగా

నేడు అనంత పద్మనాభ స్వామి వ్రతం

మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ అనంత పద్మనాభ స్వామి వ్రతానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి వివిధ అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం ఎదుట కొబ్బరికాయలు కొట్టి శివుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థినికి సన్మానం



మల్దకల్: మండలంలోని అమరవాయికి గోకారన్న సువార్తమ్మల కుమార్తె రుబికా జాతీయ అగ్రికల్చర్ ఐకార్ విభాగంలో జాతీయ స్థాయిలో 383వ ర్యాంకు సాధించడంపై బీజేపీ నాయకులు పాల్వాయి రాముడు, తిమ్మన్న, కిషోర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు రుబికాను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

రోగులకు పండ్లు పంపిణీ



అయిజ: మిలాద్- ఉన్- నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు సోమవారం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. దానికి ముందు ముస్లింలు మసీదులు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక వంటలు తయారు చేసి బంధు మిత్రులతో కలిసి విందు ఆరగించారు. ఒకరికొకరు మిలాద్- ఉన్- నబీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నేడు నిరసన

కొత్తకోట: రాష్ట్ర సచివాలయం ఎదుట మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మండలంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వామన్‌గౌడ్ పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమం అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయనున్నట్లు వామన్‌గౌడ్ తెలిపారు. సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టి, తెలంగాణ తల్లిని అవమానపర్చిన సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

అందని బిల్లులు



చిన్నపోతులపాడులోని క్రీడాప్రాంగణం(ఫైల్)

- గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తిచేసి మూడేళ్లు పూర్తి
- ఎంబీలు పూర్తయినా పట్టించుకోని అధికారులు
- ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచ్‌లు

మానవపాడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలని గ్రామానికి ఒకటి చొప్పున తెలంగాణ క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. క్రీడా ప్రాంగణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సర్పంచ్‌లు అప్పు చేసి పనులు పూర్తి చేశారు. మాజీ సర్పంచ్‌లు పనులు పూర్తి చేసి, సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు బిల్లులు అందలేదు. చేసిన పనికి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నాప్పటికీ తమకు మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు అందించాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి..

మండలంలోని 17 గ్రామపంచాయతీలు ఉండగా.. ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్షకు పైగా, కొన్ని చోట్ల రూ.50 వేలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా మండలంలోని క్రీడా ప్రాంగణాలకు సంబంధించి రూ.లక్షలు వరకు బిల్లులు మాజీ సర్పంచ్‌లకు రావాల్సి ఉంది. బిల్లులు జాప్యంపై పలుమార్లు నిరసనలు, జిల్లా అధికారులు, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావాడం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే క్రీడా ప్రాంగణాలు..

మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు సంబంధించి పనులు పూర్తియినా బిల్లులు అందలేదు. కొన్ని గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేసినట్లు బోర్డులు పెట్టినా.. మైదానాల్లో ఆటలు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయలేదు. దీంతో పేరుకే క్రీడామైదానాలు తప్పా.. ఆటలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని గ్రామాల్లోని యువకులు విమర్శిస్తున్నారు. క్రీడామైదానాలు ఎకరం స్థలంలో ఏర్పాటు ఏయాలని నిబంధనలు ఉన్నా.. స్థలాల కొరతతో తక్కువ స్థలాలు, పాఠశాల ఆవరణలోనే వీటిని ఏర్పాటు చేశారు.

ముదేళ్లు గడుస్తున్నా బిల్లులు రాలే



క్రీడా ప్రాంగణాలు నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా.. నేటి వరకు మాజీ సర్పంచ్‌లకు బిల్లులు రాలేదు. క్రీడా ప్రాంగణాలకు చెందిన బిల్లులు ఇవ్వాలని అధికారులను అడిగితే వస్తాయని సమాధానం చేబుతూ దాటవేస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అందుతాయని చెప్పినా.. బిల్లుల చెల్లింపుల్లో అధికారులు జాప్యం చేస్తున్నారు. బిల్లుల విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటంలేదు. అప్పులు తెచ్చి పనులు చేశాం. వడ్డీలు పెరిగిపోతున్నా అధికారులు స్పందించడం లేదు.

– లక్ష్మిదేవి, మాజీ సర్పంచ్, మాద్దూరు

పూర్తయిన ఎంబీలు..



అధికారులు ఎంబీలు పూర్తి చేసినా.. బిల్లులు రాలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నాయి. నేటికీ బిల్లు అందక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం.

– ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కలుకుంట్ల

జిల్లా అధికారులకు నివేదించాం..

క్రీడా ప్రాంగణాలకు సంబంధించి సర్పంచ్‌లు పనులు పూర్తి చేశారు. క్రీడా మైదానాల బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వస్తవమే. పనులు పూర్తిచేసిన జీపీల బిల్లులను జిల్లా అధికారులకు నివేదించాం.

– భాస్కర్, ఎంపీఓ, మానవపాడు

అటెన్షన్ ప్లీజ్



శిథిలమైన వంతెన..

ఇనుప చువ్వలు తేలి, కట్టెలతో జూరాల కాల్వపై వంతెన

గద్వాలటౌన్: పట్టణ శివారులో పాత హౌసింగ్ బోర్డు కాలనీ పక్కన జూరాల కాల్వపై వంతెన ప్రమాదకరంగా మారింది. ప్రమాద తీవ్రతను గుర్తించి మరమ్మతులు చేయాల్సిన అధికారులు కట్టెలు కట్టి నిర్లక్ష్యాన్ని చాటుకున్నారు. వంతెనపై పెచ్చులు ఊడిపోయి, ఇనుప చువ్వలు తేలాయి. వాటి వల్ల గతంలో పాదచారులకు గాయాలయ్యాయి. శిథిలమైన వంతెన స్థానంలో పక్కనే మరో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం అందుబాటులోకి రాలేదు. శిథిలమైన వంతెన పైనే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ వంతెనపై టిప్పర్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు వెళ్తున్నాయి. వంతెన నిర్మాణ, రక్షణ గోడలు దెబ్బతినడంతో వాహనదారులు భయపడుతున్నారు.

– ప్రశ్నించాల్సిన అధికారి పేరు : జుబేర్ అహ్మద్ , పీజేపీ ఈఈ, గద్వాల.
ఫోన్ నంబర్: 9550872847

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



తుపత్రాలలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ విజయభాస్కర్

మానవపాడు: మండలంలోని జల్లాపురం, మానవపాడు గ్రామాల్లో సోమవారం వినాయ ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనానికి తరలించారు. మహిళలు, యవతులు, యువకులు నృత్యాలు, కోలాటం వేస్తూ.. ఘనంగా నిమజ్జనం చేశారు. అంతకు ముందు వినాయకుడి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం వినాయకుడి ప్రతిమలకు వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు జపిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో ఎస్‌ఐ విజయభాస్కర్ పాల్గొన్నారు. దాతలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుడి నామస్మరణతో వివిధ గ్రామాలు మారుమోగాయి.

జీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



గువ్వలదిన్నెలో సభ్యత్వం అందజేస్తున్న నాయకులు



ప్రజలతో సభ్యత్వాలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

కేటీదొడ్డి: బీజేపీతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని మండల సభ్యత్వ కన్వీనర్ అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గువ్వలదిన్నెలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు హన్మిరెడ్డి హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేలా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంత్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాగిరెడ్డి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్వాడ్‌ను విజయవంతం చేయండి..

అయిజ: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టనున్న సేవా పక్వాడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్వాడ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో జిల్లాలోని ఆయా మండలాల్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 18 నుంచి 25 వరకు అసెంబ్లీ కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు, 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని వెంకటాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతినగర్: మండల పరిధిలోని కొంకల, జూలెకల్, జక్కిరెడ్డిపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

మల్దకల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు పాల్వాయి రాముడు అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నీలిపల్లి, చర్లగార్లపాడు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ దేశ ప్రజల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకున్నారు. తిరుపతిరెడ్డి, రెడ్డప్ప, నాగరాజు, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మల్దకల్: మండలంలోని ఎల్కూరుకి చెందిన మహేశ్వరి(30) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో శనివారం పురుగు మందు తాగిన మహేశ్వరిని చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలియజేశారు. మృతురాలికి భర్త నర్సింహులు, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం



మల్దకల్: అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ అంగన్‌వాడీ భవనం దర్శనమిస్తుంది. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం పక్కన ఉన్న మోడల్ అంగన్‌వాడీ భవనం పేరుతో రంగు రంగుల బొమ్మలతో సర్వసుందరంగా తీర్చిదిద్ది రెండేళ్లు గడుస్తున్నా.. భవనాన్ని వినియోగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. ఒక పక్క అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడమే కాక అద్దె భవనాలు, అరకొర వసతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోపక్క అంగన్‌వాడీ కేంద్రానికి ఆయా లేదనే చిన్న కారణంగా అంగన్‌వాడీ సొంత భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా క్షౌర వృత్తిదారుల దినోత్సవం



అయిజలో వైద్య నారాయణ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు



శాంతినగర్ వేడుకల్లో పాల్గొన్న నాయీబ్రాహ్మణులు

శాంతినగర్: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షౌ రవృత్తిదారుల దినోత్సవాన్ని శాంతినగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు ఐకమత్యంగా ఉంటూ డిమాండ్లు సాధించుకోవాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అందరూ కుల బంధువులకు చేరేలా కృషి చేస్తానన్నారు. డిమాండ్ల సాధనకు ప్రతిఒక్కరూ ఏకతాటిపై నిలబడాలని, అప్పుడే మన కులస్తులు బాగుపడుతారని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దస్తగిరి, భాస్కర్, రాము, మధు, బ్యాండ్ ఆంజనేయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో సోమవారం క్షౌ ర వృత్తిదారుల దినోత్సవ కార్యక్రమాన్ని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. క్షౌ ర వృత్తిదారుల గురువైన ధన్వంతరి వైద్య నారాయణ చిత్రపటానికి క్షౌ ర వృత్తిదారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కాంగ్రెస్ నాయకుల సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అయిజ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ కుమార్, డైరెక్టర్ సులోచనమ్మలను సోమవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి ముఖ్య అతిథిలుగా పాల్గొని శాలువాలు, పూలమాలలతో సత్కారం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాండు, కార్యదర్శి మధు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, షాలి, మున్నా, దూద్‌బాషా, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాసంలోని సమస్యలు పరిష్కరించండి

రాజోళి: కొత్త రాజోళిలోని పునరావాసంలో సమస్యలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్ల మధ్య నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, కాలనీలు మొత్తం బురదమయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య సీసీ రోడ్లు లేకపోవడంతో చిన్న వర్షం కురిసినా.. రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయని, దీనికి తోడు విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయని అన్నారు. ఇళ్ల మధ్యనే ముళ్లచెట్లు కూడా ఏపుగా పెరగడంతో రాత్రి సమయాల్లో విషసర్పాలు తిరుగుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువగా నీరు నిలిచే చోట మట్టిని వేయాలని, లేకుంటే కాలనీలు బురదమయంగా మారి ప్రమాదాలకు, వ్యాధులకు నెలవుగా మారుతున్నాయన్నారు. అధికారులు వెంటనే కొత్త రాజోళిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టి పరారైన బొలెరో వాహనం

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

గట్టు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి.. సమాచారాన్ని డయల్ 100కు తెలియజేయగా.. సమాచారం అందుకున్న గట్టు పోలీసులు తక్షణమే స్పందించి అందుకు కారణమైన వాహనాన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆరగిద్దకి చెందిన చిన్న హనుమంతు అలియాస్ జగ్గప్ప సోమవారం ఆరగిద్ద నుంచి గొర్లఖాన్‌దొడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఎదురుగా పైపుల లోడ్‌తో వెళ్తున్న బులెరో వాహనం ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. అటుగా వెళ్తున్న ఓ వాహనదారుడు డయల్ 100కు సమాచారం అందించాడు. దీంతో తక్షణమే స్పందించిన గట్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్‌ని ఢీకొట్టిన వాహనం ఏమిటో తెలియని పరిస్థితిలో గాయపడిన వ్యక్తిని హుటాహుటిన గద్వాల ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి నుంచి కర్నూల్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం ఎస్‌ఐ కేటి మల్లేష్ ఆధ్వర్యంలో రెండు పోలీస్ బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. బొలెరో వాహనం పీవీసీ పైపుల లోడ్‌తో ఆరగిద్ద నుంచి గొర్లఖాన్‌దొడ్డి మీదుగా బల్గెరకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పైపులు రోడ్డుపై పడటంతో వాటిని వెతుక్కుంటూ వెనక్కి వస్తూ.. ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల మధ్య మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టిడు. అక్కడి నుంచి కాల్వగట్టు మీదుగా శంకర్‌నగర్, మద్దెలబండ, మల్దకల్ మీదుగా గద్వాలకు చేరుకోగా.. అతి కష్టం మీద ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది.

పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- దోమల నివారణకు చర్యలు శూన్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఎర్రవల్లి: పల్లెల్లో ముసురు వర్షాల వల్ల ఇళ్ల మధ్య, పరిసర ప్రాంతాల్లో మురుగు కుంటలుగా చేరి దోమలు, క్రిమికీటకాలకు నిలయంగా మారాయి. ఆయా కాలనీలలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. వానాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు ముందు జాగ్రత్తగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో కరువైన పరిశుభ్రత..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, యాక్తాపురం, సాసనూలు, దువాసిపల్లి, కారుపాకుల, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించింది. గతంలో పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పలు కార్యక్రమాలు నిర్వహించినా, సమస్యలు తీరలేదు. ఆయా గ్రామాల్లో మురుగు రోడ్లపైనే పారుతోంది. డ్రెయినేజీలు ఉన్నా వాటిని పంచాయతీ కార్మికులు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనా పంచాయతీ కార్యదర్శులు గానీ, ప్రత్యేక అధికారులు గానీ స్పందించి దోమల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు

ఫాగింగ్, బ్లీచింగ్ జాడేలేదు..

కాలనీల్లో మురుగు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్‌ను చల్లకపోవడంతో ఈగలు, దోమలు గుడ్లుపెట్టి విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు అయా గ్రామాలలోని పలు కాలనీల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల కాలనీల్లో ఫాగింగ్ మిషన్ వినియోగించకపోవడంతో దోమలు, ఈగలు మరింత ఉధృతమవుతున్నాయి. అయా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ సక్రమంగా వినియోగించకపోవడంతో తుప్పు పట్టిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రవల్లిలో స్వైర విహారం చేస్తున్న పందుల గుంపు

దోమలతో సతమతమవుతున్నాం..



ఎర్రవల్లి మండల కేంద్రంలోని షేకుపల్లి రోడ్డులో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు రోడ్లపై పారుతోంది. మురుగు కుంటలుగా ఏర్పడటంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా సమస్యను పరిష్కరించాలి.

– తెలుగు వీరేష్, ఎర్రవల్లి

నివారణ చర్యలు చేపడుతున్నాం



గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ యంత్రాలకు బదులుగా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో ఫాగింగ్ చేపడుతాం. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తున్నాం. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ, ఇటిక్యాల